www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023
5
పశ్చిమ గోదావరి

కనకరత్నానికి ప్రైడ్ ఆఫ్ భారత్ పురస్కారం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని భీమలాపురానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవామండలి అధ్యక్షురాలు, నరసాపురం బిబిఐఎస్ ఉమెన్స్ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ కొత్త కనకరత్నంకు ప్రైడ్ ఆఫ్ భారత్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి వేదికగా జీఎమ్‌ఆర్ మిత్ర కళాప్రాంగణంలో జరిగిన 75వ ఆజాదీకి అమృత మహోత్సవాల్లో భాగంగా నేషనల్ ప్రెసిడెంట్ ఎస్.ఆదినారాయణ, ఏపి కన్వీనర్ కె.చంద్రప్రకాష్, ఘంటసాల అవధాని, డాక్టర్ రహంతుల్లా తదితరుల చేతుల మీదుగా తాను ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

ఎకరానికి 5 నుంచి 8 బస్తాల ధాన్యానికి మొలకలు

మొలకలు, తేమ పేరుతో ఎకరాకు రూ.14 వేల వరకు నష్టం

17 శాతం తేమ తర్వాత బస్తాకు రూ.60 నుంచి రూ.100 వరకూ కోత

లేకపోతే బస్తా ధాన్యం ఇవ్వాలని హుకుం

జిల్లాలో 25 వేల హెక్టార్లలో పంట నష్టం

90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా కళ్లాల్లోనే

మొలకలు వచ్చిన ధాన్యం

ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతు

మొలకెత్తిన ధాన్యం.. రైతన్న దైన్యం..!

ప్రజాశక్తి - భీమవరం

రైతన్న ఆరుగాలం కష్టం నీటి పాలైంది. అప్పు చేసి సాగు చేస్తే నష్టం మిగిలింది. మిచౌంగ్ తుపాన్ రైతుల్లో పెనువిషాదాన్ని నింపింది. తడిసి, మొలకెత్తిన ధాన్యం చూసి బరువెక్కిన గుండెతో రైతన్న కన్నీటి పర్యంతమవుతున్నారు. చివరకు ధాన్యం కొనుగోలులో సైతం దగా పడుతున్నారు. నిబంధనలతో సంబంధం లేదని చెప్పిన ప్రభుత్వం సవాలక్ష షరతులు పెట్టి నిలువునా దోచుకుంటుంది. జిల్లాలో 25 వేల హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లింది. సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉంది. అయితే పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతన్న అష్టకష్టాలు పడుతున్నాడు.

మిచౌంగ్ తుపాను జిల్లాను అతలాకుతలం చేసింది. ముఖ్యంగా రైతులను నట్టేట ముంచింది. పంట చేతికొచ్చే సమయంలో మిచౌంగ్ నిలువునా ముంచేసింది. తుపాన్ కారణంగా జిల్లాలో రూ.188 కోట్లు నష్టం సంభవించిందంటే పరిస్థితి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది సార్వా సాగు చేపట్టారు. అయితే సాగు ఆరంభం నుంచి రైతులు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో తుపాను కారణంగా ఈదురుగాలులు, భారీ వర్షం కురవడంతో వివిధ దశల్లో వరిపంట వర్షార్పణమైంది. జిల్లాలో 25 వేల హెక్టార్లలో వరిపంట దెబ్బతింది. సుమారు పది వేల హెక్టార్లలో వరి చేలు నీట మునిగాయి. మరో 15 వేల హెక్టార్లలో వరిపైరు నేలనంటింది. ఇదిలా ఉంటే మరో 30 హెక్టార్లలో వరి పనులు నీటిలోనే నానుతున్నాయి. 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. వర్షాలు తగ్గడంతో రైతులు హడావుడిగా మాసూళ్లు, పట్టుబడులు, ధాన్యం ఆరబెట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఎకరాకు 5 నుంచి 8 బస్తాలు మొలక : రూ.10 వేలు వరకు నష్టం

వర్షం ధాటికి ధాన్యం తడిచి ముద్దయ్యింది. ధాన్యం రాశులుగా రోడ్లు, గట్లు వెంబడి, కల్లాలు, చేలల్లో భద్రపర్చినప్పటికీ ఎడతెరిపి లేకుండా మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు ధాన్యం తడిచి మొలకలు వచ్చాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ధాన్యం రాశుల అడుగుభాగానికి నీళ్లు చేరి మొలకలొచ్చాయి. ఎకరాకు 5 నుంచి 8 బస్తాల వరకు మొలకలు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ధాన్యం రాశుల అడుగుభాగంతోపాటు చుట్టూ నీరు చేరడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక్కో ఎకరానికి రూ.10 వేల వరకు రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టిన రైతులు వర్షాల నేపథ్యంలో అదనంగా రూ.6 వేలు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. ముందు పెట్టిన పెట్టుబడులే రాని పరిస్థితుల్లో అదనంగా పెట్టుబడులు పెడితే తప్ప అవస్థలు తప్పడం లేదని చెబుతున్నారు.

పాయింట్ మార్చురీకి రూ.20.. బస్తాకు రూ.100 కటింగ్

తుపాన్ నేపథ్యంలో ప్రభుత్వం ఆర్భాటంగా నిబంధనలతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించారు. అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పైగా సవాలక్ష ఆంక్షలు పెట్టి రైతులను అడుగడుగునా దగా చేస్తున్నారు. ఆపదలో ఆదుకోవాల్సింది పోయి రైతులను దండుకుంటున్న పరిస్థితి ఉంది. తేమశాతం 17 తర్వాత ఒక్కో పాయింట్‌కు మార్చురీకి రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. ఐదు పాయింట్లు వస్తే రూ.100 చొప్పున బస్తాకు కోత విధిస్తున్నారు. ఇది కాదంటే క్వింటాకు ఒక కిలో ధాన్యాన్ని ఇవ్వాలనే నిబంధన పెడుతున్నారు. దీనివల్ల ఎకరం పంట పండించే రైతు రూ.4 వేల నుంచి రూ.4500 వరకు నష్టపోతున్నారు. మరోపక్క మొలకెత్తిన ధాన్యం కారణంగా రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు నష్టం చేకూరుతోంది. దీంతో ఎకరాకు రూ.14 వేల వరకు రైతులు నష్టపోతున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అయినకాడికి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు.

తేమ శాతం పేరుతో కోత విధిస్తున్నారు

బుద్ధ రాంబాబు, కౌలురైతు, పాలకోడేరు

మాసూళ్ళ పూర్తయిన తర్వాత ధాన్యాన్ని రాశిగా పోసి భద్రపర్చినా వర్షానికి తడిచి ముద్దయ్యింది. ఎకరాకు 8 బస్తాల వరకు మొలకలు వచ్చాయి. ప్రభుత్వం తేమ శాతంతో సంబంధం లేదని చెబుతున్నప్పటికీ కోత విధిస్తున్నారు. పాయింట్‌కు రూ.20 లేదా బస్తాకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది కాదంటే క్వింటాకు కిలో ధాన్యం అదనంగా ఇవ్వాలంటున్నారు. ఇది సరైంది కాదు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

20 బస్తాలు మొలకలు వచ్చాయి

కడిమి సూర్యారావు, కౌలురైతు, పాలకోడేరు

30 సంవత్సరాల నుంచి నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాను. తుపాన్ వల్ల 5 రోజులుగా ధాన్యం రాశి తడిచి ముద్దయ్యింది. దీంతో 20 బస్తాలు వరకు మొలకలు వచ్చాయి. బస్తాకు రూ.15 వందలు చొప్పున 20 బస్తాలకు రూ.30 వేలు నష్టం వచ్చింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

కన్నిపాముల జయరాజు, కౌలురైతు, పాలకోడేరు

మాది సొంతూరు కృష్ణా జిల్లా. పాలకోడేరు వచ్చి 30 ఏళ్లవుతోంది. నాలుగెకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. ఇప్పటి వరకు రూ.లక్షా అరవై వేల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షం ధాటికి ధాన్యం రాశి మొత్తం తడిచిపోయింది. నాకు కౌలు గుర్తింపు కార్డు లేదు. ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలి .

యనమదుర్రు ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

పూర్తిస్థాయి సహాయక చర్యలకు ఆదేశం - గ్రామాల వారీ పర్యవేక్షక కమిటీలు

ప్రజాశక్తి - భీమవరం, అత్తిలి, ఉండి

దువ్వ వద్ద నివాసితులతో మాట్లాడుతున్న మంత్రి, కలెక్టర్

ఎర్రకాలువ నుండి దిగువకు అధిక నీరు ప్రవహించడంతో యనమదుర్రు డ్రెయిన్ పోటెత్తి ముంపునకు గురైన అత్తిలి మండలం తిరుపతిపురం, వరిగేడు, ఉండి మండలం యండగండి లాకుల ప్రాంతాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో, ప్రజలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎర్రకాలువ, యనమదుర్రు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా అధిక నీరు చేరడంతో జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, పెంటపాడు, గణపవరం, పాలకోడేరు మండలాలు, భీమవరం పట్టణంలోని కొన్ని గ్రామాలు, వార్డుల పరిధిలో ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం తిరుపతిపురం, వరిగేడు గ్రామాల్లోకి అధిక నీరు చేరిందన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన పునరావాస కార్యక్రమాలను చేపట్టాలని అధికారులు ఆదేశించారు. యనమదుర్రు డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో ప్రతి కిలోమీటర్‌కు సంబంధిత తహశీల్దార్లు, పోలీసు శాఖ సమన్వయంతో ఒక గ్రామ రెవెన్యూ అధికారి, పోలీసు సిబ్బందిని డిప్యూట్ చేసి పర్యవేక్షించేలా ఆదేశించామన్నారు. ప్రజల భద్రత, తరలింపు, ఆహార సరఫరా, వైద్య శిబిరాల ఏర్పాటు, ఇతర సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్తిలి మండలం వరిగేడు, తిరుపతిపురంల్లో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను ఆమె పరిశీలించారు. మార్గంమధ్యలో దువ్వ వయ్యేరును మంత్రి కారుమూరితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అక్కడ నివశిస్తున్న నిర్వాసితులను వెంటనే ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. యనమదుర్రు కాలువకు లాకులు విరిగిపోవడం వల్ల తిరుపతిపురం, వరిగేడు ప్రాంతాల్లో అధిక నీరు చేరిందన్నారు. వెంటనే లాకుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జలవనరుల శాఖ ఇఇ దక్షిణామూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వర్లు, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఉండి

పంట నష్టం వివరాలు తెలుసుకుంటున్న సిపిఐ నేతలు

మిచౌంగ్ తుపాన్ వల్ల తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఇ-క్రాప్‌తో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ సాయం అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉండిలో పర్యటించిన సిపిఐ బృందం తడిచిన ధాన్యపు రాశులను, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించింది. అనంతరం ఉండి మార్కెట్ యార్డు వద్ద రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. మొలకెత్తిన ధాన్యం కొంటున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రకటనలిస్తున్నారని, జిల్లా అంతటా మొలకెత్తిన ధాన్యం వాసన వ్యాపించిందని, దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికలు నవంబర్ 23నే అందినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. మొలకెత్తిన, తడిచిన ధాన్యం అంతటినీ మద్దతు ధరకే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టుకుంటున్న కౌలు రైతులు పొన్నాటి రామారావు, పొన్నాటి మల్లమ్మ, జామి శ్రీనివాసరావు, కొంగరపు ప్రభాకర్, అల్లు సత్యనారాయణ, పి.శ్రీనివాసులను పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలతోపాటు జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, నేతలు ఎం.సీతారాంప్రసాద్, చెల్లబోయిన రంగారావు, సికిలే పుష్పకుమారి, సనపల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : చీఫ్‌విప్ ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని రెండో అంతస్తులో జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన జెడ్‌పిటిసి ఛాంబర్ గురువారం ఆయన జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గత నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజారంజక పాలన అందించి ఇతర రాష్ట్రాలకు సిఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, మైలాబత్తుల శ్రీను, సర్పంచి వెంకటరాజు, ఎఈ నాగేశ్వరరావు, కాంట్రాక్టర్ ఆకన ఏసుబాబు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులు, స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సిఐటియు జిల్లా కౌన్సిల్ డిమాండ్

లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

20 నుంచి వచ్చే జనవరి 8 వరకు ఆందోళనలు

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న రాయ్

కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పదవీకాలం పూర్తవుతున్నా కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలను నేటి వరకూ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, పని భద్రత వంటి సమస్యలపై నేటికీ పరిష్కారం చూపించలేదని విమర్శించారు. కరోనా సమయంలోనూ విరామం లేకుండా పని చేసిన కార్మికులు, స్కీమ్ వర్కర్లు ఈ కాలంలో అనేక ఆందోళనలు చేసినప్పటికీ కార్పొరేట్ సేవలో మునిగితేలుతున్న ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లుల విషయంలో ప్రభుత్వ పాలసీల వల్ల మిల్లులు మూతబడి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకొచ్చాక అనేక చిన్న తరహా పరిశ్రమలు మూత పడి కార్మికులు రోడ్డున పడ్డారని మండిపడ్డారు. ఆక్వా రంగం కుదేలవ్వడానికి ప్రభుత్వ విధానమే కారణమన్నారు. బజారు హమాలీలకు రోజురోజుకీ పని తగ్గుతుందన్నారు. స్కీమ్ వర్కర్లు, మున్సిపల్, పంచాయతీ కార్మికులు, విఆర్ఎల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లేందుకూ సిద్ధపడుతున్నారన్నారు. ప్రజలు, కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలకు బుద్ధి చెబుతున్న వైనం పక్కనున్న తెలంగాణలో కన్పించిందని, అదే పరిస్థితి రాష్ట్రంలో కూడా వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలని, లేనిపక్షంలో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మె, ఆశాలు, విఒఎల ఆందోళనలకు సిఐటియు సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20 నుంచి జనవరి 8వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, డి.కళ్యాణి, కె.ఝాన్సీలక్ష్మి, ఎ.అజయ్‌కుమారి, వెంకటేశ్వరరావు, జవ్వాది శ్రీనివాస్, ఆంజనేయులు, సూరిబాబు, డి.జ్యోతి, ఎమ్‌డి.హసీనా, ఎం.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం తక్షణం ఇవ్వాలి

వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకే పరిహారం ఇవ్వాలి

కేంద్ర, రాష్ట్ర బృందాలు పంట నష్టాలను అంచనా వేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకూ రూ.20 వేలకుపైగా నష్టపరిహారం, ఇన్సూరెన్స్ తక్షణం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. ఈ నెల 5, 6 తేదీల్లో మిచౌంగ్ తుపాను నేపథ్యంలో జిల్లాలో పలు మండలాల్లో పర్యటించిన సిపిఎం బృందాలు పరిస్థితులను పరిశీలించిన నేపథ్యంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుపాను వల్ల జిల్లాలో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టాలను పరిశీలించామని, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో రైతులు ప్రతి ఎకరాకూ ఇంతవరకు రూ.25 వేలకుపైగా ఖర్చు చేశారన్నారు. కౌలు రైతులకు ఈ ఖర్చుతోపాటు కౌలు చెల్లింపు అదనపు భారంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం, ఇన్సూరెన్స్ అందించాలని డిమాండ్ చేశారు. దాళ్వా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు 50 శాతం రాయితీపై ఇవ్వాలని కోరారు. నష్టపరిహారం వాస్తవ సాగుదారులెన కౌలురైతులకే అందించాలని డిమాండ్ చేశారు. తేమశాతం నిబంధనలు ఎత్తివేసి మద్ధతు ధరకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయాలన్నారు. మంచి సంచులు, బరకాలు సరఫరా చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇచ్చి, రవాణా ఛార్జీలను పూర్తిగా ప్రభుత్వమే భరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బృందాలు పంట నష్టాలను వెంటనే పరిశీలించి సాయమందించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న నారుమడులకు నష్టపరిహారం చెల్లించకపోతే రైతాంగం కోలుకోలేదన్నారు. ఉచితంగా విత్తనాలు ఇవ్వాలన్నారు. దెబ్బతిన్న కాయగూరలు, ఆకుకూరలు, పండ్ల తోటలు, అరటి, కొబ్బరి, తమలపాకు, ఉప్పు, ఆక్వా పంటలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అధ్వానంగా ఉన్న రోడ్లు తుపాన్‌కు మరింత దెబ్బతిన్నాయని, వెంటనే రోడ్లు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. డెల్టా ఆధునికీకరణ పనులు వచ్చే వేసవిలో యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ముంపు నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న కాలనీల్లో పూడిక, రోడ్లు, డ్రెయిన్లు, వీధిదీపాలు, ఇతర మౌలిక వసతులు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. సుడిగాలి వల్ల ఆస్తి, పంట నష్టం వాటిల్లిన వారిని తక్షణం ఆదుకోవాలన్నారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, వ్యవసాయ కార్మికులు, పేదలకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

నరసాపురం టౌన్: మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.20 వేలకుపైగా నష్టపరిహారం అందించి, పంటల బీమా పూర్తిగా వర్తింపజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ నాయకులు మండలంలోని మల్లవరం, మల్లవరం లంక, లిఖితపూడి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. నీట మునిగిన పంటకే కాకుండా మొలకెత్తిన ధాన్యానికి కూడా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వరితోపాటు ఆక్వా, కూరగాయలు, పండ్ల తోటలు, ఇతర పంటల రైతులను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లు, విద్యుత్ పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని, నివాస ప్రాంతాల్లో ముంపు నీటిని బయటకు తోడించి వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు కవురు శ్రీనివాస్, బందెల ప్రసాద్, కవురు ఆదియ్య, పరువు సంసేను, కవురు వెంకట్రావు, పెచ్చెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో నేలనంటిన వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

పాలకోడేరు: తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను, కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య డిమాండ్ చేశారు. కోరుకొల్లులో తడిచిన ధాన్యం రాశులను పరిశీలించి నష్టపోయిన కౌలురైతులతో మాట్లాడారు. తక్షణం ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని అశ్రియ్య కోరారు. కౌలురైతులు వల్లపల్లి శ్రీను, శ్రీరాములు, లక్ష్మణరావు, వెంకట్రావు, దానయ్య పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేయాలి

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ప్రజాశక్తి - ఆచంట

తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయిన ప్రతి రైతు, కౌలు రైతుకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, క్షేత్రస్థాయిలో నష్టం సక్రమంగా నమోదు చేయాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్‌అంబరీష్ అన్నారు. గురువారం సాయంత్రం ఆచంట మండలం కొడమంచిలిలో నేలనంటిన పంట పొలాలను పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఏ రైతూ నష్టపోకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. అనంతరం తాడేరు మురుగు డ్రెయిన్‌ను పరిశీలించి గుర్రపుడెక్కను తక్షణం తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ జయలలిత, మండల వ్యవసాయ విస్తరణాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

మురుగుకాల్వలను ఆధునికీకరించాలి

రైతులను ఆదుకోవాలి - పంట నష్టం పరిశీలనలో రైతు, కౌలురైతు సంఘాల నేతలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జిల్లాలో ఏళ్ల తరబడి మురుగుకాలువలను ప్రక్షాళన చేయకపోవడంతో వర్షపు నీరు దిగువకు వెళ్లక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు తెలిపారు. మండలంలో మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను, మురుగు కాలువలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని ప్రధాన మురుగు కాలువలు సరిపల్లి, నత్తాలోవ, గోరింతాడ, కాజ డ్రెయిన్, దర్భరేవు కొత్తకాయలతిప్ప, ఈస్ట్ కుక్కిలేరు వంటి డ్రెయిన్లు తవ్వకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లక చేతికొచ్చిన పంట కళ్ల ముందే కుళ్లిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని ఎకరాకు రూ.30 వేలకు పెంచాలని, పంటల బీమా కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పోలిశెట్టి రమేష్, పిట్టా చిట్టిబాబు, గమిడి మధుబాబు, మైలాబత్తుల బాలు, రత్నరాజు పాల్గొన్నారు.

పూడిపోయిన మురుగుకాల్వను చూపుతున్న కౌలురైతు నేతలు

తడిచిన ధాన్యం చూపుతున్న రైతు నేతలు, రైతులు

తణుకు రూరల్: ప్రభుత్వం, ముఖ్యమంత్రి, అధికారులు రైతులను మోసగిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ విమర్శించారు. గురువారం మండలంలోని వేల్పూరు, మహాలక్ష్మి చెరువు గ్రామాల్లో ఆయన పర్యటించారు. తడిచిన ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ తేమ శాతం పేరుతో మిల్లర్లు దోపిడీ చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. పాత పద్ధతిలోనే మిల్లర్ల వద్ద తేమశాతం పేరుతో రైతుల నుండి డబ్బు గుంజడం సరైనది కాదని విమర్శించారు. ధాన్యం ఎలాగున్నప్పటికీ ప్రభుత్వం చెప్పినట్లు వెంటనే ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెప్పినట్లు తడిచిన ధాన్యం, మొలకలు వచ్చిన ధాన్యం ప్రతి గింజా కొనుగోలు చేయాలని కోరారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రం, రైతులు మల్లాడి సత్యనారాయణ, పారిసర్ల ధనరాజు, వేగుళ్ల సూర్యనారాయణ, పెనుమర్తి వెంకట సత్యనారాయణ, కోళ్ల వెంకటేశ్వరరావు, కనకదుర్గ, దేవానంద్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్ఎఫ్ఐ లోగో ఆవిష్కరించిన గుడాల గోపీ

ఎస్ఎఫ్ఐ 45వ జిల్లా మహాసభ ఈ నెల 15, 16 తేదీల్లో పాలకొల్లు పట్టణంలో జరగనుంది. ఈ మహాసభను పురస్కరించుకుని రూపొందించిన ఎస్ఎఫ్ఐ లోగోను పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులను చైతన్యపర్చేందుకు ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కె.యశ్వంత్, నాయకులు పవన్, పి.శేఖర్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతను చాటుతాయి : ఎంపిపి

ప్రజాశక్తి - ఆచంట

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ఐక్యతను చాటుతాయని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' కిట్లను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో యువకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ చదువుతో నిమిత్తం లేకుండా 16 సంవత్సరాల లోపు యువతీ యువకులు క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. గ్రామస్థాయిలో విజేతలకు మండల స్థాయిలో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎర్రిపల్లి నాగరాజు, ఎంపిటిసి బొర్ర లీలా సుబ్రహ్మణ్యం, ఎఒ జగన్నాధరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఐరన్ మాత్రలతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు రక్తహీనతను నివారించడానికి ఐరన్ మాత్రలు వాడాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు అన్నారు. గురువారం తమ ఆసుపత్రి పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలలోని 379 మంది విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి గురువారం ఐరన్ మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.నున్నాపాప, ఎఎన్ఎం ప్రేమలీల, బాలికల హైస్కూల్ హెచ్ఎం బాలపరమేశ్వరరావు పాల్గొన్నారు.

మురుగు పారుదలకు చర్యలు

ప్రజాశక్తి - ఆచంట(పెనుమంట్ర)

తుపాన్ తాకిడికి ముంపుకు గురైన పంట పొలాల మురుగు నీటిని కాలువలోకి సిబ్బందితో పారుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. గత మూడు రోజులుగా తుపాన్ తాకిడికి ముంపుకు గురైన పంట పొలాల్లో నీటిని కాలువలో పారుదల చేయాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆలమూరు పంట పొలాలు పర్యటించి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో రాపాక కాలువ నుంచి వస్తున్న పెనుమంట్ర, భట్లమాగుటూరు సరిహద్దు కాలువను ప్రక్షాళన చేస్తున్నట్లు ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మారంపూడి బాపూజీ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెత్తను తొలగిస్తున్న రైతులు

పొక్లెయిన్‌తో చెత్త తొలగింపు

ప్రజాశక్తి - ఆచంట

తాడేరు డ్రెన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తుపాన్ కారణంగా పంట పొలాలు నేలకొరగడంతో చేల్లో ఉన్న నీటిని తొలగించేందుకు రైతులు స్వచ్ఛందంగా గురువారం గుర్రపు డెక్క తొలగించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. మండలంలో వాతావరణం అనుకూలించడంతో రైతులు పంట పొలాలలో ఉన్న మురుగు నీటిని తొలగించుకునే పనిలో ఉన్నారు. తాడేరు వంతెన కింద బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ స్తంభాలు ఉండడంతో స్థానిక రైతులు, అధికారులు పొక్లెన్ ద్వారా టెలిఫోన్ స్తంభాలను పైకి లేపడంతో వంతెనకు అడ్డుపడిన గుర్రపు డెక్కను తొలగించారు. ఈ కార్యక్రమంలో రైతులు నెక్కంటి విశ్వేశ్వరరావు, వెంకట్రావు, పెచ్చటి సత్యనారాయణ, శ్రీనివాసరావు, నరసింహమూర్తిఉన్నారు.

రైతులెవ్వరూ అధైర్య పడొద్దు : గుడాల

ప్రజాశక్తి - పోడూరు

మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన వద్దిపర్రు, పెనుమదం గ్రామాల్లో వరి పొలాలను పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని, రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. వరి పొలాలలో నిలిచిన నీటిని ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు, జెసిబిలతో బయటకు తీసేందుకు ప్రభుత్వం జిఒ ఇచ్చిందని, మొలకెత్తిన, రంగు మారిన, ప్రతి ధాన్యం గింజను ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట యడ్ల తాతాజీ, గుమ్మాపు సూర్య ప్రసాద్, కొర్రపాటి వీరాస్వామి, వడ్లపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

వైభవంగా మావుళ్లమ్మమాల ఇరుముడి విరమణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో వేంచేసియున్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దీక్షమండలి మాలధారణ ఇరుముడి విరమణ కార్యక్రమం గురువారం ఎంతో వైభవంగా జరిగింది. 500 మందికిపైగా మాలదారులు అమ్మవారికి ఇరుముడి సమర్పించుకున్నారు. అమలాపురం, తణుకు, నర్సాపురం నుంచి కూడా అమ్మవారి మాల ధరించి కొంతమంది భక్తులు అమ్మవారికి ఇరుముడిలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి నెయ్యభిషేకం ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ నిర్వహించారు. తదుపరి మాలాదారులు, వాళ్ల కుటుంబ సభ్యులు, భక్తులతో కలిపి 1,500 మంది భక్తులుకు అమ్మవారి అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు(నాగన్న బాబు), ధర్మ కర్తలు ముత్యాల వెంకట రామారావు, చెల్లంకి నాగ శేషగిరి(గిరి), మావూరి సుందరరావు రామాయణం, సత్యనారాయ, గోపిశెట్టి విజయలక్ష్మి, కోయ వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

ఆచంట (పెనుమంట్ర):వర్షాల నేపథ్యంలో పశువులకు అంటువ్యాధుల ప్రబలకుండా విధిగా టీకాలు వేయించాలని పెనుమంట్ర వెటర్నరీ వైద్యాధికారిణి జి.వరలక్ష్మి సూచించారు. దొమ్మవ్యాధి రాకుండా పెనుమంట్ర, జుత్తిగ, ఆలమూరు, పొలమూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, నెలమూరు, వెలగలేరు గ్రామాల్లో గురువారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ఆరు నెలలు దాటిన దూడల నుంచి అన్ని రకాల పశువులకు టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు.

ప్రమాద బాధితునికి జనసేన సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఎల్.అగ్రహారం గ్రామానికి చెందిన జనసైనికుడు యోగి కల్యాణి కుటుంబాన్ని తాడేపల్లిగూడెం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.పదివేలు ఆర్థికసాయం చేశారు. తాడేపల్లిగూడెం మండలం అమృతపురంలో అగ్నిప్రమాదానికి గురైన రుద్ర ఏడుకొండలు తాటాకిల్లు ఇటీవల కురిసిన భారీవర్షాలకు కూలిపోవడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.పదివేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం పుల్లాయగూడేనికి చెందిన పుట్టా పోతురాజు కుమారుడు పుట్టా శ్రీను అకాల మృతితో వారి కుటుంబసభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.పది వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండల జనసేన అధ్యక్షులు అడపా ప్రసాద్, రాజు, మద్దాల మణికుమార్, అడ్డగర్ల సూరి, రాంబాబు, అడబాల మురళీ, కోట శ్రీరామ్, పిడుగు మోహన్ బ్రదర్స్, రుద్ర రమేష్, రుద్ర శేషగిరి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యనమదురు డ్రెయిన్‌కు వరద

రక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేసిన విప్, ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తుపాను ప్రభావం తగ్గిన తర్వాత ఎగువ నుంచి ఎర్రకాలువకు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆ ప్రభావం యనమదుర్రు డ్రెయిన్‌పై పడింది. గురువారం నాటికి యనమదుర్రు డ్రైన్ నీటిమట్టం 32.8 అడుగులకు చేరుకోగా, ప్రభుత్వం రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేసింది. ఈ నేపథ్యంలో వరద ప్రభావం భీమవరంకు తలెత్తే పరిస్థితి ఉంటుందని ముందుగానే గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ స్థానిక క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యనమదుర్రు డ్రైన్‌కు నీటిమట్టం తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా డ్రైన్ గట్టు ఎక్కువైనా బలహీనంగా ఉంటే వెంటనే ఆ గట్టు ప్రదేశాన్ని పటిష్ట పరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి అన్ని సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా పట్టణంలో మిరియాలకోడు, గంగానమ్మ గుడి వద్ద పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలని, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి వ్యవసాయ అధికారులు సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వై.రవికుమార్, ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్, ఎఇ వినయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, అగ్రికల్చర్ ఎఒ నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

తుపాన్ బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

టిడిపి అధికార ప్రతినిధి వీరవల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - కాళ్ళ

మిగ్ జాం తుపాన్ బారి నుంచి ప్రజల్ని కాపాడటంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి వీరవల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిగ్ జాం తుపాన్ మొత్తం రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిందని, ప్రధానంగా రైతాంగానికి చెప్పలేనంత నష్టం వాటిలిందన్నారు. కోతకు వచ్చిన వరిపైరు నీళ్లపాలై అన్నదాతకు గుండెకోత మిగిల్చిందన్నారు. తిరిగి కోయడానికి వీల్లేని విధంగా వరిపైరు పనికిరాకుండా పోయిందన్నారు. ఇప్పటికే కోసి వదిలేసిన వరి మొత్తం నీళ్లల్లో కుళ్లిపోతుందని ఆయన ఆందోళన చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం ఒక్క 10 శాతం వరిపైరు మాత్రమే రైతుల చేతికి అందిందన్నారు. మిగిలిందంతా నీళ్లపాలైందన్నారు. వరితో పాటు మిర్చి, పత్తి, పొగాకు,

అరటి, అపరాలు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. రాబోతున్న ప్రకృతి విపత్తును ముందే పసిగట్టడంలో, సకాలంలో స్పందించి రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకోవడంలో జగన్ రెడ్డి, అతని అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. తక్షణమే నీటమునిగిన పంటపొలాలు పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలు పక్కన పెట్టి రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌పై ఉందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం నిబంధనలు సడలించి మరీ తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొని రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. మిగ్ జాం తుపాన్ వల్ల ప్రాణాలు కోల్పోయిన ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సాయుధ దళాల జెండా దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డిఎన్ఆర్ కళాశాల సీనియర్ డివిజన్ ఎన్‌సిసి కాడెట్ల ఆధ్వర్యంలో సాయుధ దళాల జెండా దినోత్సవంను గురువారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బిఎస్.శాంత కుమారి తెలిపారు. ఇందులో భాగంగా భీమవరం పట్టణ పుర వీధుల్లో భారీ జన చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) ప్రారంభించి మొదటి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో జన సంచారం సాధ్యం కాని ప్రదేశాల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పహరా కాస్తూ దేశాన్ని రక్షిస్తున్న ఎందరో సైనికుల సేవలు మరువలేనివి, వెలకట్టలేనివన్నారు. యుద్ధంలో గాయపడి ఉద్యోగాలు కోల్పోయిన లేదా మరణించిన వారి కుటుంబాలకు సైనిక సంక్షేమ నిధి ద్వారా సహాయం అందుతుందన్నారు. ప్రిన్సిపల్ శాంత కుమారి మాట్లాడుతూ సైనిక సంక్షేమ నిధికి ప్రజలందరూ విరాళాలు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. కళాశాల పాలక వర్గ సభ్యులు పి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ గత సంవత్సరం డిఎన్ఆర్ కళాశాల క్యాడెట్లు జిల్లాలోనే అత్యధికంగా విరాళాలు సేకరించారన్నారు. అనంతరం కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్య మాట్లాడారు. ఈ ర్యాలీలో భాగంగా కాడెట్లు పట్టణ ప్రజలతో పాటు ప్రముఖుల నుంచి విరళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్‌జె.సోమ రాజు, వివిధ శాఖాధిపతులు, సిబ్బంది, కాడెట్లు ఎం.పవన్ సాయి విఘ్నేష్ పాల్గొన్నారు.

పంట రుణాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తుపాన్ కారణంగా నష్టపోయిన రైతుల పంట రుణాలను రద్దు చేయాలని, తడిసిన వరి ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మామిడి దానవరప్రసాద్ డిమాండ్. తుపాన్ కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులను, పంటల నష్టాన్ని తెలుసుకోవడానికి వరప్రసాద్ మోదుగుంట, అప్పారావుపేట, దండగర్ర, మాధవరం, జగన్నాధపురం, నవాబ్ పాలెం, కొండ్రుపోలు, ఉప్పరగూడెం, ఎల్ అగ్రహారం గ్రామాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ తుపాన్ కారణంగా నష్టపోయిన రైతాంగానికి బీమా, పంట నష్టపరిహారం ఇచ్చి అన్ని విధాలా ఆదుకోవాలని, నష్టపోయిన రైతన్నలకు ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం సత్వరం చెల్లించి రైతుల్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మంచాల సత్తిపండు, పుల్ల సత్తియ్య, శ్రీను, ప్రసాద్, బాలకృష్ణ, రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

జగన్నాధపురంలో సూపర్ శానిటేషన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పారిశుధ్యం క్షీణించి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా మండలంలోని జగన్నాధపురంలో సర్పంచి ఉంద్రాజవరపు చంద్రిక ఆధ్వర్యంలో గురువారం సూపర్ శానిటేషన్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా, వీధుల్లోనూ బ్లీచింగ్ చల్లించారు. ఎక్కడా చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయించారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి ఇంటింటికీ వెళ్లి భారీ వర్షాల నేపథ్యంలో నీరు కలుషితమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సూపర్ శానిటేషన్ నిర్వహిస్తున్నామన్నారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా, మురుగునీరు నిల్ల లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించి, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాస్‌రెడ్డి, జడ్డు ఫణీంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే జగన్ లక్ష్యం

ఉండి:పేదల ఆర్థికాభివృద్ధే సిఎం జగన్ లక్ష్యమని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. గురువారం ఉప్పులూరులో నిర్వహించిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైసిపి మండల అధ్యక్షులు ఆంజనేయరాజు, ఎంపిటిసి నిమ్మల కేశవ్‌కుమార్, నాయకులు యర్రా సుబ్బారావు, డాక్టర్ వెంకటేశ్వరరావు, నిమ్మల బాబ్జీ, దానం విద్యాసాగర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ ఉపాధ్యాయలకు జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

భీమవరం:జిల్లాలో పనిచేస్తున్న పార్ట్ టైమ్ ఉపాధ్యాయులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో 2012 నుంచి జిల్లాలో 600 మంది ఆర్ట్స్, క్రాఫ్ట్, పిఇటి విభాగాల్లో పార్ట్ టైం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారన్నారు. వీరికి చెల్లిస్తున్నది అరకొర వేతనాలేనని పేర్కొన్నారు. మూడు నెలల నుంచి పార్ట్ టైమ్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాల్సింది పోయి మొత్తానికి నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. ప్రతి నెల ఇఎంఐలు, ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు ఇలా అనేకం చెల్లించాల్సి ఉంటుందని జీతాలు అందించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో జగన్ పాదయాత్రలో పార్ట్ టైం ఉపాధ్యాయులను రెగ్యులర్ చేస్తామని చెప్పి నాలుగున్నరేళ్ల గడుస్తున్నప్పటికీ కనీసం పట్టించుకోలేదన్నారు. అలాగే సమాన పనికి సమాన వేతనం ఇస్తామని చెప్పి చేసిన పనికి వేతనాలు అందించట్లేదంటే పార్ట్ టైమ్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు.

తుపాను బాధితులకు 'హెల్పింగ్ హార్ట్' చేయూత

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెంలో తుపాను ప్రభావంతో పునరావాస కేంద్రాలకు వచ్చిన బాధితులకు ది హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు తినుబండారాలను ఆ సంస్థ సభ్యులు గురువారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కారుమంచి జీవరత్నం మాట్లాడారు. బాధితులకు సేవ చేసేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశామన్నారు. పేరుపాలెంలో వృద్ధాశ్రమం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొప్పినేని రాధాకృష్ణ, కోశాధికారి తిరుమల విశాఖ ఉన్నారు.

వెదుళ్లపాలెంలో జ్వరాల సర్వే

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు పంచాయతీ పరిధిలోని వెదుళ్లపాలెంలో డెంగీపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆరోగ్య సిబ్బంది స్పందించారు. ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే నిర్వహించారు. పారిశుధ్య లోపమే డెంగీ జ్వరాలకు కారణమని అధికారులకు వివరించారు. దీనిపై పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి స్పందించి అక్కడికి వెళ్లి పరిశీలించారు. డ్రెయినేజీ సమస్యను గోపి దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకర్, ఏనుగపల్లి శేఖర్, పీతల స్వామి, కోటయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

గణపవరం:తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని, తడిసిన ప్రతిగింజనూ కొనుగోలు చేస్తామని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం మండలంలోని మొయ్యేరు, ముప్పర్తిపాడు, ఎస్.కొండేపాడు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్నపంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన పడొద్దన్నారు.

పోడూరు:తుపాన్ మిగిల్చిన ప్రాథమిక నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు గురువారం పెనుమదం, గుమ్మలూరు గ్రామాల్లో రైతుల్ని కలిసి పరిశీలించారు. మండల వ్యాప్తంగా దాదాపు 13 వేల ఎకరాల్లో శార్వాలో వరి సాగు చేయగా, అందులో మూడు వేల ఐదు వందలు ఎకరాల వరి దెబ్బతిందని, దీనిని ప్రాథమికంగా పైఅధికారులకు నివేదిక అందజేస్తామని వారు తెలిపారు.

ఆచంట: తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. గురువారం మండలంలో టిడిపి ఆధ్వర్యంలో తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పంట చేతికొచ్చే సమయంలో నీటిపాలైందని, రైతులకు నష్టాలు, అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులకు జరిగిన నష్టాన్ని కళ్లారా చూసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. మొన్నటి వరకు రైతులు కరువుతో నష్టాలు పాలు కాగా నేడు తుపాను వల్ల కోలుకోని విధంగా రైతుల నష్టపోయారని ఆయన వాపోయారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, పితాని వెంకట్, కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, దొంగ నాగార్జున, కేతా మురళి, బోడపాటి దుర్గాప్రసాద్ ఉన్నారు.

యలమంచిలి:మండలంలోని కాజా, చించినాడ, యలమంచిలి, ఆర్యపేట, సిరగాలపల్లిలో నీట మునిగిన వరి పొలలను పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు గురువారం పరిశీలించారు. యలమంచిలిలో నీటమునిగిన వరి చేను కోస్తున్న కూలీలను కలిసి వారితోపాటు వరి కోతకోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు పరిహారం వచ్చేవరకూ ప్రభుత్వంపై పోరాడుతానని హామీ ఇచ్చారు.

పంట రక్షణకు రైతన్న పాట్లు

ప్రజాశక్తి - ఆకివీడు

వర్షాలకు దెబ్బతిన్న వరిని కాపాడుకునేందుకు రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. నేలకొరిగిన వరిని పైకిలేపి కట్టలుగా కట్టి నిలబెడుతున్నారు. కోతలు పూర్తయిన చేలు సుమారు 20 శాతం ఉండగా వాటిలో వరి బయటకు వచ్చేందుకు మార్గం లేకుండా పోయింది. ఆ పనులను ఎలా నూర్పిడి చేయాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఓ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కాపవరం సచివాలయం పరిధిలో వాలమర్రుకు చెందిన వేండ్ర మల్లన్నకు వైఎస్ఆర్ బీమా లబ్ధిని అధికారులు అందించారు. తొలుత పథకంలో మట్టి ఖర్చులకు రూ.10 వేలు, వారం రోజుల్లోనే రూ.4.90 లక్షలు మొత్తం రూ.ఐదు లక్షలు కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుబాబుబాబు, సచివాలయ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, BHIMADOLU
OS.NO.119/2020
Between:
Smt. Nekkanti Mani Raja Kumari ...PLAINTIFF
Vs
1. Bobba Purnachandrarao
2. Bobba Srinivasa Rao ...DEFENDANTS
NOTICE
2nd Defendant:
Bobba Srinivasa Rao, Son of Purnachandra Rao, Cultivation, Lingapalem, Chintalapudi Mandal, W.G.Dt.
WHEREAS the plaintiff filed the suit for partition of the suit schedule property. The Honnourable court order notice to the 2nd defendant in the above suit.
Whereas the notice addressed to the 2nd defendant in the above suit could not be served as last known address and the summons could not be served:
Whereas the Honourable court ordered notice of the 2nd Defendant by way substituted service by way of publication;
You, are hereby called upon to appear in person or through Advocate before this Honurable court on 19-12-2023 at 10-30 AM and state your objections if any. Lest suit will be decided ex-parte.
Bhimadole, Dt. 27-11-2023 D.KRISHNA SASTRY Advocates for plaintiff

ప్రకటన
మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 704/2022
Between:
వాది:
మేడపాటి శ్రీరామకృష్ణారెడ్డి తరుపు GPA హోల్డర్ అయిన మేడపాటి నాగ సంతోషి
మరియు
ప్రతివాదులు: మేడపాటి శ్రీహరి గోపాలరెడ్డి వగైరా
2వ ప్రతివాది: గుడిమెట్ల శ్రీ గోపాలకృష్ణరెడ్డి, S/o. లక్ష్మణరెడ్డి, డో.నెం. 4-57/2, కంతేరు, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534126.
పై నెంబరు దావా గ్రంథమునందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నిసార్లు దావాలో సమన్లు పంపించిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా సమన్లు అమలు నిమిత్తము ది. 29-12-2023 సంగరం తేదీనకు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయము గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చు కోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
//By Order//
డి.సుబ్రహ్మణ్యం
దేవ వీర వెంకట సత్యనారాయణమూర్తి
వాది తరపు న్యాయవాదులు
ది.04-12-23 తణుకు, సెల్: 9701310996

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు
ఆర్.ఓ.సి. నెం. 78/2021/ఇ1 తేది.07-12-2023
ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు
పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘ నిధులతో ఆర్.సి.సి. కల్వర్టు, వీధి దీపముల రిపేర్లు మరియు నిర్వహణ కొరకు అవసరమగు ఎలక్ట్రీషియన్స్‌ను చేయు నిమిత్తం (2 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ. 6,64,500/-లతో మరియు GGMP నిధులతో సి.సి. రోడ్లు, సి.సి. డ్రైన్స్ మరియు కల్వర్ట్స్ నిర్మాణం నిమిత్తం (3 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ. 5,60,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 08-12-2023 తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి లభించును.
మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.
సం/- బి.ఆర్.యస్.శేషాద్రి
మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు

దస్తావేజులు పోయినవి
ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నారాయణపురం గ్రామ కాపురస్థులైన అక్కిన లక్ష్మీనారాయణ, తండ్రి: వీరాస్వామి అను నాకు గల 7355/2016 నంబరు కలిగిన పొలం దస్తావేజులు 4-12-2023వ తేదీన నారాయణపురం నుంచి తాడేపల్లిగూడెం వెళుతుండగా దస్తావేజులు కలిగిన కవర్ మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈక్రింద అడ్రసుకు తెలియజేయగలరు.
అక్కిన లక్ష్మీనారాయణ
సాయిబాబా ఆలయం వద్ద, నారాయణపురం
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా
పిన్: 534406, సెల్: 9542223761

దస్తావేజులు పోయినవి
ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నారాయణపురం గ్రామ కాపురస్థులైన అక్కిన లక్ష్మీనారాయణ, తండ్రి: వీరాస్వామి వియ్యపురాలైన విజయవాడకు చెందిన పుట్టగుంట రామతులసి అలియాస్ గంటా రామతులసి, భర్త: శివరామ్ ప్రసాద్ అను నాకు గల 4211/2013 నంబరు కలిగిన పొలం దస్తావేజులు 4-12-2023వ తేదీన మా వియ్యంకుడైన అక్కిన లక్ష్మీనారాయణకు ఇవ్వగా నారాయణపురం నుంచి తాడేపల్లిగూడెం వెళుతుండగా దస్తావేజులు కలిగిన కవర్ మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈక్రింద అడ్రసుకు తెలియజేయగలరు.
అక్కిన లక్ష్మీనారాయణ
సాయిబాబా ఆలయం వద్ద, నారాయణపురం
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా
పిన్: 534406, సెల్: 9542223761

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, BHIMADOLU
I.A.NO.347/2020, OS.NO.119/2020
Between:
Smt. Nekkanti Mani Raja Kumari ...PETITIONER/PLAINTIFF
Vs
1. Bobba Purnachandrarao
2. Bobba Srinivasa Rao ...RESPONDENTS/DEFENDANTS
NOTICE
2nd RESPONDENT:
Bobba Srinivasa Rao, Son of Purnachandra Rao, Cultivation, Lingapalem, Chintalapudi Mandal, W.G.Dt.
WHEREAS the petitioner filed the above petition to grant ad-interim injunction restraining the respondents/defendants 1 & 2 from alienating the plaint schedule property in any manner during the pendency of the suit.
Whereas the notice addressed to the 2nd respondent in the above suit could not be served as last known address and the notice could not be served: Whereas the Honourable court ordered notice of the 2nd respondent by way substituted service by way of publication;
You, are hereby called upon to appear in person or through Advocate before this Honurable court on 19-12-2023 at 10-30 AM and state your objections if any. Lest the petition will be decided ex-parte.
Bhimadole, Dt. 27-11-2023 D.KRISHNA SASTRY Advocates for plaintiff

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ. నెం. 1212/19 మరియు
ఐ.ఏ. నెం. 1213/19 ఇన్
ఏ.యస్. నెం. 13/2019
బిట్వీన్:
1. ముప్పిడి ఆశీర్వాదం (లేటు) -పిటీషనర్/అప్పిలెంట్
2. ముప్పిడి జాన్‌వెస్లి, తండ్రి:(లేటు) ఆశీర్వాదం, వయస్సు 30 సం॥లు, డోరు నెం. 9-64, జగన్నాధపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, ప॥గో॥జిల్లా.
3. ముప్పిడి జార్జ్‌బాబు, తండ్రి: (లేటు) ఆశీర్వాదం, వయస్సు 43 సం॥లు, డోర్ నెం. 9-64, జగన్నాధపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, ప॥గో॥జిల్లా.
-పిటీషనర్స్2, 3/ప్రపోజిల్ 2, 3 అప్పిలెంట్స్
అండ్
1. ముప్పిడి పద్మ, భర్త: సుదర్శన్, వయస్సు 40 సం॥లు, గృహిణి, డోరు నెం. 2-105, కురెళ్ళగూడెం గ్రామం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.
2. ముప్పిడి సుజాత, భర్త: ఆకుల ఆనందరావు, వయస్సు 28 సం॥లు, కూలి, డోరు నెం. 2-13, పాతూరు, ఎస్‌సి కాలని, తాడేపల్లిగూడెం పట్టణం, ప॥గో॥జిల్లా.
3. ముప్పిడి సుధ, తండ్రి: సుదర్శన్, వయస్సు 27 సం॥లు, కూలి, యర్రమిల్లిపాడు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
4. ముప్పిడి సునీత, భర్త: నేకూరి రవి, వయస్సు 25 సం॥లు, కూలి, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.
5. ముప్పిడి వెంకట సత్యనారాయణ, తండ్రి: సుదర్శన్, వయస్సు 24 సం॥లు, కూలి, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా.
6. ముప్పిడి రమేష్, తండ్రి: సుదర్శన్, వయస్సు 15 సం॥లు, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా (మైనర్ అయినందు వలన గార్డియన్ రిప్రజెంట్‌గా ఉన్నారు)
7. ముప్పిడి జకర్య, తండ్రి: సుదర్శనం, వయస్సు 15 సం॥లు, డోరు నెం. 2-25, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా (మైనర్ అయినందు వలన గార్డియన్ రిప్రజెంట్‌గా ఉన్నారు)
8. ముప్పిడి చంటిబాబు, తండ్రి: వెంకట్రావు, వయస్సు 55 సం॥లు, కూలి, డోరు నెం. 1-20, వల్లూరుపల్లి, పెంటపాడు మండలం, ప॥గో॥జిల్లా.
9. ముప్పిడి శ్యామ్‌బాబు, తండ్రి: వెంకట్రావు, వయస్సు 53 సం॥లు, కూలి, డోరు నెం. 7-45, చివటం గ్రామం, ఉంద్రాజవరం మండలం, ప॥గో॥జిల్లా.
10. ముప్పిడి సమూయేలు, తండ్రి: వెంకట్రావు, వయస్సు 50 సం॥లు, కూలి, డోరు నెం. 10-25, లలితనగర్, తణుక, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.
11. ఉంద్రాజవరపు భాగ్యలక్ష్మి, భర్త: వెంకన్న, వయస్సు 48 సం॥లు, గృహిణి, డోరు నెఉం. 6-11/3, పాతూరు, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.
-రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్
పై నెంబరు గ్రంధములో రెస్పాండెంట్స్ 1 టు 7 గార్లు శ్రీ కోర్టు వారి ద్వారా మమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికి మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 22-12-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 గంటలు లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై పిటీషన్‌లు మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎస్.కొండలరావు
పిటీషనర్/అప్పిలెంటు/ పిటీషనర్స్ 2, 3 /ప్రపోజిల్ 2 అండ్ 3 అప్పిలెంట్స్ తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం
తేది:06-12-2023